క్లుప్తంగా

విద్యుత్ తీగలు తగిలి టిప్పర్ దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న టిప్పర్

ఆదోని అర్బన్: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బైపాస్ రోడ్డులో శనివారం గరుసును అన్‌లోడ్ చేస్తుండగా హైపర్ టెన్షన్ విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్ జరగడంతో టిప్పర్ అగ్ని ప్రమాదానికి గురైంది. వెంటనే స్థానికులు అగ్ని ప్రమాదం కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇన్‌చార్జ్ అధికారి రామాంజనేయులు, ఫైర్ సిబ్బంది ఫైరింజన్‌తో అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. దీంతో టిప్పర్ ట్రాలీ, సామగ్రి దగ్ధం కావడంతో రూ.9 లక్షలు దాకా ఆస్తినష్టం వాటిల్లింది. ఫైర్ ఇంజిన్ ఎల్ఎఫ్ కేశవ, ఫైర్‌మెన్ రంగస్వామినాయుడు, సిబ్బంది అనిల్‌కుమార్, శివయ్య పాల్గొన్నారు.

అమ్మాయిలకు సమాన హక్కులివ్వాలి

కౌతాళం: ఆడపిల్లలను రక్షిద్దాం, వారికి సమాన హక్కులను పంచాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అఖిలప్రియ, కార్తికేయని పిలుపునిచ్చారు. బేటి బచావో..బేటి పడావో కార్యక్రమాన్ని శనివారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ పుష్పలత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కిశోర బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు బాలికలను తప్పకుండా చదివించాలని చిన్న వయస్సులోనే వివాహాలు జరిపించే పద్ధతిని మానుకోవాలని సూచించారు.

పోలీసు బలగాల కవాతు



ఆదోని పట్టణ ప్రధాన రహదారిలో కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక దళాలు

ఆదోని అర్బన్: శనివారం పెద్దతుంబళం ఎస్ఐ పీరయ్య, తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి, ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. పోలీసుల భద్రత నడుమ ఓటింగ్ జరుగుతుందని, ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రానున్న జనరల్ ఎలక్షన్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు ఎస్ఐలు తెలిపారు. కార్యక్రమంలో టూటౌన్ కానిస్టేబుల్ పెద్దయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుంటలో పడి పాదయాత్ర భక్తుడు మృతి



మృతి చెందిన హనమంత్ బసప్ప

మంత్రాలయం : నీటి కుంటలో స్నానానికి వెళ్లి శ్రీశైలం వెళ్తున్న పాదయాత్ర భక్తుడు మృత్యువాత పడ్డాడు. వివరాలు.. కర్ణాటకలోని బెల్గాంకు చెందిన హనమంత్ బసప్ప (22) కాలినడకన 5 రోజుల క్రితం శ్రీశైలం బయలుదేరాడు. మంత్రాలయం మండలంలోని చిలకలడోణ గ్రామం సమీపంలోని ఉదయం స్నానాలకు ఉపక్రమించాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ప్రాణాలు వదిలాడు. గమనించిన తోటి భక్తులు బసప్ప మృతదేహాన్ని కుంట నుంచి వెలికితీశారు. తోటి యాత్రికుడు మృత్యువాత పడటంతో భక్తులు కన్నీరుమున్నీరయ్యారు. మంత్రాలయం ఎస్ఐ గోపీనాథ్ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకుని బంధువులకు సమాచారం చేరవేశారు. తోటి భక్తుల సహాయంతో గ్రామానికి మృతదేహాన్ని తరలించే ఏర్పాటు చేశారు.

పోషకాహార కిట్ల పంపిణీ



కిట్లను అందుకుంటున్న క్షయవ్యాధిగ్రస్తులు

ఆదోని టౌన్: ఆదోని టీబీ యూనిట్ పరిధిలో క్షయవ్యాధిగ్రస్తులకు శనివారం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. శనివారం స్థానిక ఆర్‌టీపీసీ ల్యాబ్ వద్ద 20 మంది క్షయవ్యాధిగ్రస్తులకు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రీదేవి నేతృత్వంలో హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు, సిబ్బంది చేతులమీదుగా పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. బాబురాజు మాట్లాడుతూ.. క్షయవ్యాధితో బాధపడుతున్న వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు, నెలనెలా వారీ ఖాతాల్లోకి రూ.500 చొప్పున ఆరు నెలల పాటు ఇవ్వడం జరుగుతుందన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల వ్యాధిగ్రస్తులు త్వరగా ఆరోగ్యవంతులు అవుతారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లలితమ్మ, సుబ్బమ్మబాయి, పద్మావతి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



కాళ్లకు కర్రలు కట్టుకుని పాదయాత్రగా వెళ్తున్న కన్నడిగులు



కాలినడకన మల్లన్న చెంతకు



భజనలు చేస్తూ, కావిడి మోస్తూ వెళ్తున్న భక్తులు



కోసిగి: ఉగాది పర్వదినం సందర్భంగా.. తమ ఆడపడుచు భ్రమరాంబదేవిని దర్శించుకుని, సారె సమర్పించేందుకు కర్ణాటక రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాదయాత్రగా వెళ్తున్నారు. ఈనెల 25వ తేదీన పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున తమ ఇళ్లల్లో భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రంలోని శిరుగుప్ప, సింధనూరు, గదగ్, కొప్పల్, దార్వాడ, జమ్మండి శివమొగ్గ, శిరువార్ తదితర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాదయాత్రగా వెళ్తున్నారు. కాగా మూడు రోజుల నుంచి భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. కొందరు మొక్కు చెల్లింపులో భాగంగా రెండు, మూడు అడుగుల కర్రలను కాళ్లకు కట్టుకుని వెళ్తున్నారు. దాదాపు 750 కిలోమీటర్లు..పదిహేను రోజు పాటు నడిచి శ్రీగిరి చేరుకుంటామని వారు పేర్కొంటున్నారు. ఏప్రిల్ 8న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అక్కడికి చేరుకుని స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకుంటామన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా మండలంలోని పలు ప్రాంతాల్లోని ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు భోజన, తాగునీటి వసతి, సేద తీరేలా ఏర్పాట్లు, మందులు, వైద్య సేవలు అందజేస్తున్నారు. మండలంలోని ఆర్లబండ, కొల్మాన్‌పేట, దుద్ది, రైల్వే గేటు సిద్దరూడ మఠం, కుర్ది నాగరాజు కాంప్లెక్స్, చైతన్య స్కూల్, రంగప్ప గట్టు డి.బెళగల్ ప్రాంతాల్లో అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిపై ఉల్లంఘన కేసు నమోదు

ఆదోని అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన నిబంధనల కింద (ఎంసీసీ) బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠతో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ గోపీచంద్ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి పట్టణంలో కునిగిరి నీలకంఠతో పాటు మరికొందరు బైక్ ర్యాలీ నిర్వహించినందుకు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనుమతి తీసుకొని సమావేశాలు, ర్యాలీలు నిర్వహించుకోవాలని సూచించారు.

ఆదోని రూరల్: మండలంలోని దిబ్బనకల్, విరుపాపురం క్రాస్ రోడ్డు వద్ద బీజేపీ ప్రచార రథం తిరుగుతుండగా ఆదోని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయశేఖర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి శనివారం విలేకరులకు తెలిపారు.

గురువులను గౌరవించాలి

ఆస్పరి: దైవ సమానులైన గురువులను శిష్యులు గౌరవించి వారి బోధనలను పాటించాలని అనంతపురం జిల్లా శాంతానంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీగురు సేవానందస్వామిజీ అన్నారు. శనివారం ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామంలో శ్రీశివరామ దయానంద స్వామి నవమ ఆరాధన మహోత్సవాలు శ్రీరామ సేవ కుటీరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుసేవానందస్వామిజీ మాట్లాడుతూ.. సమాజంలో మార్పు రావాలంటే గురువ పాత్ర కీలకమన్నారు. సద్గురు రాఘవేంద్రస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి, రామకృష్ణ పరమహంస బోధనలు సమాజానికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. నిస్తేజంగా ఉన్న వ్యక్తిలో తేజస్సును నింపి వెలుగు పథంలో నిలబెట్టే వారే నిజమైన గురువన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, జోహరాపురం అద్వైతానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీనివాసాచార్యులు స్వామి, శ్రీరామసేవ సంఘం అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షుడు హనుమంతు పాల్గొన్నారు.

నెరవేరిన కాత్రికి వాసుల కల

- సిమెంటు రోడ్డుతో గ్రామానికి కొత్తకళ
- గడప గడప నిధులు రూ. 20లక్షలతో రోడ్ల నిర్మాణం
- గ్రామస్తులకు తప్పిన అవస్థలు



మారెమ్మ గుడి నుంచి రోడ్డు (నాడు)



మారెమ్మ గుడి నుంచి కాలువ వరకు సిమెంటు రోడ్డు వేసిన తర్వాత (నేడు)



కౌతాళం: కొన్ని దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో మండల పరిధిలోని కాత్రికి గ్రామ వాసుల కల నేరవేరింది. కాత్రికి గ్రామంలో ప్రధాన రోడ్డు బస్టాండు ప్రాంతంలోని మారెమ్మ గుడి సర్కిల్‌లో సిమెంటు రోడ్డు లేక ఏ చిన్న పాటి వర్షం వచ్చినా బురదమయంగా మారి గ్రామస్తులు అవస్థలు పడేవారు. అలాగే నదిచాగి, బాపురం రస్తా, పాదలకుంట వెళ్లే రస్తాలతో పాటు పాఠశాల రోడ్లపై గుంతలు ఏర్పడి వర్షలు నీరు నిలిచేది. దీంతో ఆయా గ్రామాల ప్రయాణికులతో పాటు విద్యార్థులకు ఇబ్బందులు తప్పేవికాదు. గత ప్రభుత్వం హయంలో గ్రామస్తులు ఎన్నో సార్లు విన్నపించుకున్నా ఎవరూ పట్టించుకోలేదు.

'గడప గడప'లో సమస్య పరిష్కారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ రోడ్డు విషయం స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రభుత్వం గడప గడప నిధులు రూ. 20లక్షలు మంజూరు చేయడంతో మారెమ్మ గుడి నుంచి పాదలకుంట వైపు కాలువ వరకు సిమెంటు రోడ్డు పూర్తి అయ్యింది. బస్టాండు ప్రాంతం అంత సిమెంటు రోడ్డు పూర్తి కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా పూర్తి అవుతున్నాయి. ఇప్పటికే మొదటి విడతగా వచ్చిన రూ.20లక్షలతో గ్రామంలో పలు చోట్లు సిమెంటు రోడ్లు, గ్రావెల్ రోడ్లు వేసినట్లు సర్పంచ్ ఎంకప్ప, గ్రామ ఇన్‌చార్జి నాగభూషణ్‌గౌడ్‌లు తెలిపారు.



మారెమ్మ గుడి ఇరువైపుల వేసిన సిమెంటు రోడ్డు

ఉరుకుందలో కొనసాగిన టెండర్లు



టెండరు పక్రియలో పాల్గొన్న డీసీ వెంకటేష్

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి సరఫరా చేసే వివిధ పనులకు శనివారం ఆలయ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ ఆధ్వర్యంలో షీల్డ్, బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఆలయానికి ప్లంబింగ్ మెటీరియల్ సరఫరా, టికెట్ల ప్రింటింగ్, భక్తుల లగేజీ, సెల్‌ఫోన్‌ల భద్రపరుచుటకు టెండర్లు చేపట్టారు. అలాగే..స్వామి వారికి వస్త్రాలు, శాలువలు, పూలు సరఫరా, ఆలయ భూముల కౌలు సాగు టెండర్లకు ఎవరూ రాకపోవడంతో వాటిని రద్దు చేశారు. ఏడాదికి సంబంధించి హక్కుల కోసం.. భక్తుల లగేజీని భద్రపరిచేందుకు రూ. 5,51,000 దక్కించుకున్నారు. ఈ టెండరు గతేడాది రూ.4,59,410 పలికింది. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా మఠం వార్షికోత్సవాలు



శ్రీరమా సమేత సత్యనారాయణ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



కూచిపూడి నాట్య ప్రదర్శన

పెద్దకడబూరు : మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో వెలసిన సద్గురు తిమ్మనాచార్యుల మఠంలో శనివారం 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీ రమా సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం అనంతరం తిమ్మనాచార్యుల ఉత్సవమూర్తికి తులాభారం నిర్వహించారు. మఠం పీఠాధిపతులు శ్రీగురు మురళీ మోహనాచార్యులు, ఆయన తల్లి జానకమ్మ సత్యనారాయణస్వామికి తులాభారం చేపట్టారు. రాత్రి ఎమ్మిగనూరుకు చెందిన కేఎస్ నాగరాజు, శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నాట్యం ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా శ్రీ సద్గురు భీమారాయులు మఠం పరంపర అధ్యక్షుడు, నరసింహమూర్తి , వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్నతోనే పథకాల కొనసాగింపు



ఓటర్లను అభ్యర్థిస్తున్న మురళీమోహన్ రెడ్డి

కోసిగి: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని అగసనూరు గ్రామంలో మూడవ రోజు మండల నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను జగనన్న నెరవేర్చారని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ఆయన సొంతమన్నారు. మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బెట్టనగౌడ్, నాయకులు జగదీష్ స్వామి, ఆకాష్ రెడ్డి పాల్గొన్నారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు



కౌతాళంలో అలంకరణలో ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు సందడిగా మారాయి. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుడుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాల్లో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా..తెల్లవారుజామున అర్చకులు స్వామి వారికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు చేపట్టారు.అలాగే స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు జరిపించారు.

టీబీ డ్యాంలో 4.8 టీఎంసీల నీరు



హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర రిజర్వాయర్‌లో నీటిమట్టం అడుగంటుతోంది. టీబీ బోర్డు అధికారులు ఇప్పటికే పలు కాలువలకు నీటి సరఫరాను నిలిపివేశారు. ఏప్రిల్ 11వ తేదీ నుంచి ఎల్లెల్సీకి కూడా నిలిపివేయనున్నారు. డ్యాంలోని నీటిని తాగునీటి అవసరాల కోసం వాడుకోనున్నారు. నీరు డెడ్ స్టోరేజీకి పడిపోతుండడంతో అధికారులు తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. వర్షాకాలంలో డ్యాంలో నీరు చేరితే జూలైలో మళ్లీ విడుదల చేస్తారు. జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరునందించే తుంగభద్ర కాలువ నాలుగేళ్లుగా రెండు కార్లకు సాగునీరు అందించింది. వర్షాభావ కారణంగా ఈ ఏడాది ఖరీఫ్‌కు మాత్రమే సాగు విడుదల చేశారు.

రిజర్వాయర్‌లో నీటి నిల్వలు

టీబీ డ్యాం పూర్తి సామర్థ్యం 1633 కాగా శనివారం నాటికి 1580.85 అడుగులకు చేరుకుంది. మొత్తం 105.788 టీఎంసీలకు గాను కేవలం 4.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో నిల్ ఉండగా, అవుట్‌ఫ్లో రూపంలో ఎల్లెల్సీకి 730, జిందాల్‌కు 10, రాయబసవన కాలువకు 120 క్యూసెక్కులు కలిపి మొత్తం 860 క్యూసెక్కుల నీరు డ్యాం నుంచి బయటకు వెళుతోంది. గత ఏడాది ఇదే సమయానికి 8.588 టీఎంసీల వరకు నీరు ఉంది. ఇక ఎల్లెల్సీకి సంబంధించి ఆంధ్రా కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 480 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

కోర్టు బిల్డింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి



జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రావును కలిసిన బార్ అసోసియేషన్ నూతన కమిటీ

ఆదోని రూరల్: ఆదోనిలో కోర్టు భవనాల సముదాయాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదోని బార్ అసోసియేషన్ నూతన కమిటీ శనివారం స్థానిక జిల్లా పోర్ట్ పోలియో న్యాయమూర్తి సురేష్‌రెడ్డిని, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేసింది. 2021లో కోర్టు భవనాల కోసం శంకుస్థాపన చేస్తే ఇప్పటివరకు కేవలం బేస్‌మెంట్ వరకు మాత్రమే నిర్మాణం జరిగిందన్నారు. నిర్దిష్ట కాలపరిమితితో నిర్మాణం పూర్తి చేసి కక్షిదారులకు ఇబ్బందులు కలగకుండా అందుబాటులోకి తీసుకురావాలని న్యాయమూర్తిని కోరారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుదర్‌సింగ్, వైస్ ప్రెసిడెంట్ జనార్దన్, ట్రెజరర్ లతీఫ్‌అహ్మద్, సీనియర్ న్యాయవాదులు విశ్వనాథ్‌రెడ్డి, వై.ఆర్.మల్లికార్జున, జీవన్‌సింగ్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

శుద్ధిపడిన బుద్ధిలోనే పరమాత్మ జ్ఞానము



గోవును పూజలు చేస్తున్న తితిదే సభ్యులు

ఆదోని అర్బన్: శుద్ధిపడిన బుద్ధిలోనే పరమాత్మ జ్ఞానము వికసిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఢణాపురం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగు రోజులపాటు యం.మద్దయ్యస్వామి, శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు భక్తులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు న్యాయకంటి భీమిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షులు రాధారెడ్డి, ఎస్‌కే అరుణ, మాతృమండలి అధ్యక్షురాలు ఆర్.అరుణ, మాజీ సర్పంచ్ శెట్టి వీరన్నగౌడ్, యం.మల్లికార్జున, కె.శివప్ప, భీమలింగన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: 2023–24 అకాడమిక ఇయర్ పూర్తిగాక ముందే నారాయణ విద్యా సంస్థలు వచ్చే సంవత్సరానికి పుస్తకాల విక్రయం, ముందస్తు అడ్మిషన్‌లు చేస్తుంటే విద్యాధికారులు పట్టించుకోవడం లేదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ అన్నారు. శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అక్షరాలతో లక్షల వ్యాపారం వసూలు చేస్తుంటే విద్యాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ధర్నా కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, జిల్లా నాయకులు నరేష్, డివిజన్ నాయకులు రసూల్, నగేష్, నరసింహులు, ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.





రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు, పాస్టర్లు

ప్రపంచ శాంతి కోసం ర్యాలీ

ఆదోని సెంట్రల్: ప్రపంచ శాంతి కోసం ర్యాలీ చేపట్టినట్లు ఫాస్టర్లు భాస్కర్‌బాబు, బెనర్జీ, ఫిలిప్, రవిప్రకాష్ తెలిపారు. క్రీస్తు పునరుత్థాన దినాన్ని పురస్కరించుకుని శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం చేపట్టారు. బైపాస్ మహిమ చర్చి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ విక్టోరియా పేటలోని సీఎస్ఐ చర్చి ప్రాంగణం వరకు సాగింది. ర్యాలీలో క్రైస్తవ సోదర సోదరీమణులు భారీ ఎత్తున తరలివచ్చారు. వారు మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, త్యాగం ప్రతి మానవుడు కలిగి ఉండాలన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫాస్టర్లు విలియం సుజిత్, ఆశీర్వాదం, బాలరాజు, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.